# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు ఉత్తమ సేవలు అందేలా రెవిన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఉద్ఘాటించారు.**

**2.** **తెలంగాణా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈరోజు నుండి అమెరికా, దక్షిణ కొరియా దేశాలలో పర్యటిస్తున్నారు.**

**3.** **ఆంధ్ర ప్రదేశ్‌లో రేషన్ కార్డు దారులకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**4.** **తెలంగాణా రాష్ట్రంలో మహిళలకు 20 వేల కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.**

**5.** **ప్రముఖ భరత నాట్య... కూచిపూడి నృత్యకారిణి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత యామినీ కృష్ణమూర్తి కన్నుమూశారు.**

=========================

ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించే విధంగా రెవిన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. సమస్యలను ప్రజా సమస్యలు, ఉద్యోగ సమస్యలు, కార్యకర్తల సమస్యలుగా విభజించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు దూర ప్రయాణాలు చేసి అమరావతి రాకుండా జిల్లాల వారీగా మంత్రులు, నియోజకవర్గాల వారీగా శాసన సభ్యులు వినతులు స్వీకరించేలా యంత్రాంగాన్ని రూపొందిస్తున్నామని వివరించారు. పోలీసు వ్యవస్థను పాటిస్తూ ప్రజా పోలీసు వ్యవస్థగా తీర్చి దిద్దుతామని చంద్రబాబు నాయుడు తెలియజేశారు.

-------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో రేషన్ కార్డుదారులకు వచ్చే నెల నుంచి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. నిన్న జరిగిన గుంటూరు జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... రేషన్ వ్యవస్థ ద్వారా పేదలకు తక్కువ ధరకే కందిపప్పును అందజేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు అందించవలసిన రేషన్ పంపిణీలో అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే అందరూ సమష్టిగా పనిచేయాలని,

పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని నాదెండ్ల మనోహర్ కోరారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో సహకార సంఘాల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు అందిస్తామని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు. ఎన్.టి.ఆర్. జిల్లా విజయవాడలో నిన్న జరిగిన ఆప్కాబ్ రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ .... 2019 సంవత్సరంలో తీసుకు వచ్చిన ఆప్కాబ్ చట్టాన్ని రద్దు చేసి 2016 సంవత్సరంలో చేసిన చట్టాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఏ ప్రభుత్వానికైనా ...., ప్రజలకైనా సహకార సంఘాలు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. ప్రతి కౌలు రైతుకు బ్యాంకు రుణాలు ..., ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ...., సహకార వ్యవస్థలో ఈ – కెవైసి అమలు చేసి .... పారదర్శకంగా సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. కౌలు రైతులను సహకార సంఘాలలో సభ్యులుగా చేర్చి రుణాలు అందించాలని ...., చిట్టచివరి కౌలు రైతుకు కూడా న్యాయం జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

---------------------------

తెలంగాణా ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిన్న అమెరికాకు బయలుదేరి వెళ్లారు. ఈరోజు నుండి ఈ నెల 13వ తేదీ వరకు ఆయన అమెరికా ...., దక్షిణ కొరియా దేశాలలో పర్యటిస్తారు. తెలంగాణా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ పర్యటనలో భాగంగా ఐ.టి, లైఫ్ సైన్సెస్, ఆహార శుద్ధి తదితర రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

---------------------------

తెలంగాణా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో మహిళలకు 20 వేల కోట్ల రూపాయల మేర వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ముదిగొండ మండలం కమలాపురంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్ ను ప్రవేశ పెట్టామని చెప్పారు. మధిర నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని, అంగన్ వాడీలలో మూడవ తరగతి వరకు ఏర్పాటు చేసి ... నాలుగవ తరగతి నుండి విద్యార్థులను ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు పంపించే ఏర్పాట్లు చేస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం విద్యా రంగంలో సరికొత్త ఒరవడి సృష్టిస్తోందని ఆంధ్ర ప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఎన్.టి.ఆర్. జిల్లా విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లో భారతీయ సైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో "ఉన్నత విద్యా సంస్థలలో జాతీయ విద్యా విధానం –2020 అమలు, సవాళ్లు" అనే అంశంపై నిన్న జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ .... భారత దేశాన్ని అన్ని రంగాలలో సమున్నత స్థానానికి తీసుకువెళ్ళే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన గొప్ప కార్యక్రమాలలో జాతీయ విద్యా విధానం ఒకటని తెలిపారు. బట్టి విధానానికి స్వస్తి పలికి సృజనాత్మకత పెంపొందించడం, ప్రతి ఒక్కరూ చదువుకునేలా ప్రోత్సహించడం నూతన విద్యా విధానం ముఖ్యాంశాలని, విద్యార్థి దశలోనే నైపుణ్య శిక్షణ కల్పించడం, మరొక కీలక అంశమని సత్య కుమార్ యాదవ్ చెప్పారు.

---------------------------

ప్రముఖ భరతనాట్యం ...., కూచిపూడి నర్తకి యామినీ కృష్ణమూర్తి నిన్న డిల్లీలో మరణించారు. ఆమె వయసు 84 సంవత్సరాలు. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలలో ఉన్నత స్థాయీ శిఖరాలను అధిరోహించిన యామినీ కృష్ణమూర్తి తెలుగింటి ఆడపడుచు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లిలో 1940 వ సంవత్సరం డిసెంబర్ 20వ తేదీన ఆమె జన్మించారు. అతి చిన్న వయసు నుండే నాట్యంలో రాణించడమే లక్ష్యంతో, మొక్కవోని పట్టుదలతో ఈ కళను అభ్యసించారు. ఎన్నో నృత్య రూపకాలలో యామినీ కృష్ణమూర్తి కనబరచిన హావభావాలకు ప్రజల నుండి విశేష ప్రశంసలు అందాయి. నాట్య రంగంలో ఆమె సాధించిన ప్రతిభా పాటవాలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమెను 1968 సంవత్సరంలో పద్మశ్రీ, 2001 సంవత్సరంలో పద్మ భూషణ్, 2016 సంవత్సరంలో పద్మ విభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఆమె తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా కూడా సేవలు అందించారు. డిల్లీలో నృత్య పాఠశాల నెలకొల్పి ఎంతో మంది యువతకు భరత నాట్యం, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. యామినీ కృష్ణమూర్తి మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. భారత దేశం గర్వించదగిన నృత్య కారిణినీ కోల్పోయామని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

---------------------------

ఈరోజు ప్రముఖ తెలుగు కవి కరుణ శ్రీ జంధ్యాల పాపాయ్య శాస్త్రి జయంతి. ఈ సందర్భంగా తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1912 ఆగస్టు 4వ తేదీన గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించిన పాపాయ్య శాస్త్రి 20వ శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. సులభ శైలిలో సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారంతో వినసొంపైన ఖండ కావ్యాలతో ఆయన రచనలు సాగేవి. కరుణ రస ప్రధానమైన అనేక కవితలు రాసి 'కరుణశ్రీ' గా సుప్రసిద్ధులయిన ఆయన 1992 జూన్‌లో కన్నుమూశారు.

---------------------------

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైన జూరాల ...., సుంకేసుల జలాశయాల నుండి 4 లక్షల 81 వేల 246 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద చేరుతుండడంతో పది రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి అధికారులు దిగువన నాగార్జున సాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలలో విద్యుదుత్పత్తి జరుగుతోంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ... ప్రస్తుతం 565 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. మరొక రెండు లేదా మూడు రోజులలో నాగార్జున సాగర్ జలాశయం నిండే అవకాశం ఉంది. శ్రీశైలం జలాశయం వద్ద నీటిని విడుదల చేస్తున్న సుందర దృశ్యాన్ని తిలకించడానికి ఆంధ్ర ప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున సందర్శకులు ఆ ప్రాంతానికి తరలి వెళుతున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల

శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. నిన్న జరిగిన గుంటూరు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... ఆంధ్ర ప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం 2 లక్షల 50 వేల ఇళ్లు మంజూరు చేస్తే కేవలం 70 వేల ఇళ్లు మాత్రమే నిర్మించుకోగగలిగామని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖలో 800 కోట్ల రూపాయల మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ కు 60:40 నిష్పత్తిలో సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని, దీని వల్ల పది లక్షల మంది పేదలకు గృహాలు ఏర్పాటవుతాయని, ఉపాధి హామీ పథకం కింద సమకూరే నిధులను కూడా మనం సక్రమంగా వినియోగించుకోవాలని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

======================